క్లుప్తంగా

అన్నదానం ట్రస్టుకు రూ.లక్ష విరాళం


విరాళం అందజేస్తున్న దాతలు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన అన్నదాన ట్రస్టుకు బుధవారం ఓ దాత విరాళం అందజేశారు. విజయవాడకు చెందిన దాత కల్యాణ వెంకట గణపతి రూ.లక్ష నగదును విరాళంగా సమర్పించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది కోదండపాణి, బాలాజీ పాల్గొన్నారు.

చిత్తూరు సమితి ఎన్నిక ఏకగ్రీవం


నూతనంగా ఎంపికైన కమిటీ సభ్యులు

చిత్తూరు కార్పొరేషన్: ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం (ఏపీపీఆర్ఎంఈఏ) చిత్తూరు సమితి ఎంపిక ఏకగ్రీవంగా జరిగింది. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి షేక్ నౌషదాలీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు సమితి అధ్యక్షుడిగా కుమార్ (గుడిపాల), ఉపాధ్యక్షుడిగా చంద్రశేఖర్ (గుడిపాల), కార్యదర్శిగా వినయ్ (చిత్తూరు), కోశాధికారిగా యశ్వంత్ (యాదమరి), సంయుక్త కార్యదర్శిగా సుధాకర్ (సిద్ధంపల్లె), జిల్లా కౌన్సిల్ సభ్యులుగా గిరిప్రసాద్ (యాదమరి), శ్రీనివాసులు (చిత్తూరు) ఎన్నికయ్యారని వివరించారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోండి


రైతులకు చాఫ్ కట్టర్లు అందజేస్తున్న ఎమ్మెల్యే

బంగారుపాళెం: రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మురళీ మోహన్ తెలిపారు. బుధవారం స్థానిక పశు వైద్య ఆస్పత్రి ఆవరణలో రైతులకు చాఫ్ కట్టర్లు (గడ్డికోత యంత్రాలు) పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల కోసం అనేక రాయితీ పథకాలను అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విద్యార్థులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏడీ ఆసిఫ్, నేతలు జయప్రకాష్, జనార్దన్ పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు


అవగాహన కల్పిస్తున్న ఏఈ నందకుమార్

ఐరాల: రానున్న వేసవిలో గ్రామాల్లో ఎలాంటి నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నందకుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని పాతపాళ్యంలో ఆర్‌డబ్ల్యూఎస్, ఎస్ఎస్‌డీ సంయుక్తంగా క్రాష్ ప్రోగ్రాంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 1వ తేదీ నుంచి 20 వరకు క్రాష్ ప్రోగ్రాంపై గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వాటర్ ట్యాంకుల చుట్టుపక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలన్నారు. ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయాలని సూచించారు. పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మతులు చేయడం, చేతి పంపులు రిపేర్ చేయడం చేతి పంపునకు గ్రీసు వేయడం కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది జయకృష్ణ పాల్గొన్నారు.

ఇసుక లారీల సీజ్


సీజ్ చేసిన ఇసుక లారీ

గుడిపాల: తమిళనాడుకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు లారీలను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు గుడిపాల ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు.. బుధవారం చిత్తూరు–వేలూరు రహదారిలోని గొల్లమడుగు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా చిత్తూరు వైపు నుంచి వేలూరు వైపు వెళ్తున్న రెండు లారీలను తనిఖీ చేయగా అక్రమంగా తమిళనాడుకు ఇసుక తరలిస్తుండడంతో వాటిని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. ఇందులో ఆరుగురిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ఇన్‌చార్జులమయం

- మా ఊరికి రోడ్డు వేస్తారా లేదా..ఎమ్మెల్యేకు చెప్పాలా ఎన్నిసార్లు మీకు ఫోన్ చేయాలి అదిగో వస్తామంటారు కానీ రారు..ఇలాగైతే మా ప్రభుత్వం వచ్చి ఉపయోగం ఏమిటీ అని ఆర్ అండ్‌బీలో ఓ అధికారిని చిత్తూరు టీడీపీ చోటా నేత నిలదీశాడు.
- నేను చెప్పిన చోట రోడ్డు వేయాలి లేకుంటే అన్నకు చెబుతా. తర్వాత తెలుసు కదా ఏమవుతుందో అని కుప్పానికి చెందిన ఓ టీడీపీ నాయకుడు పంచాయతీరాజ్‌లోని ఓ అధికారికి హుకుం జారీ చేశాడు
- ఎండా కాలంలో పడమటి మండలాల్లో ఎక్కువగా నీటి కొరత వస్తుంది. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా, బోర్ల రిపేర్లు, ఇతర పనులన్నీ అన్న మమ్మల్నే చూసుకోమంటాడు.. అన్నీ మాకే కావాలని పలమనేరుకు చెందిన ఓ నాయకుడు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను హెచ్చరించాడు.

- శాఖలు నిర్వీర్యం.. సేవలు మాయం
- అభివృద్ధికి దూరంగా పల్లెలు
- ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్, ఆర్అండ్‌బీలకు ఇన్‌చార్జులే దిక్కు
- పని భారంతో అవస్థలు పడుతున్న అధికారులు


జిల్లా ఆర్అండ్‌బీ కార్యాలయం

చిత్తూరు కార్పొరేషన్: పంచాయతీరాజ్ విభాగంలో సొంత జిల్లాకు చెందిన అధికారులు డివిజన్, ఆపై స్థాయి పోస్టుల్లో పనిచేయరాదని ఆశాఖా మంత్రి


జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కార్యాలయం

డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశించారు. కానీ పీఆర్‌లో అందుకు విరుద్ధంగా ఈఎన్‌సీ (ఇంజినీరింగ్ ఇన్ చీఫ్) నుంచి సడలింపు తెచ్చుకొని జిల్లాకు చెందిన వారు పనిచేస్తున్నారు. ఇలా అస్మదీయులకు సడలింపులు ఇస్తున్నా అవసరమైన పోస్టులను భర్తీ చేయడంలో మాత్రం శ్రద్ధ చూపడం లేదు. కూటమి ప్రభుత్వంలో ఆదాయంపై ఉన్న శ్రద్ధ ఇంజినీరింగ్ శాఖలో ఖాళీలను భర్తీ చేయడంలో లేదని తెలుస్తోంది. పల్లె పాలనలో కీలకమైన ఆర్‌డబ్ల్యూఎస్, పంచాతీరాజ్ శాఖల్లో పలు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటిని భర్తీ చేయకపోవడంతో ఉన్న ఉద్యోగులపై పని ఒత్తిడి పెరిగి సతమతమవుతున్నారు. దీనికి తోడు సమావేశాలతోనే వారికి ఉన్న సమయం సరిపోతోంది. వీటితో పాటు ఆర్అండ్‌బీ శాఖలోనూ ఖాళీలు వేధిస్తుండడంతో అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయి.

అదనపు బాధ్యతలు

ఆర్‌డబ్ల్యూఎస్: జిల్లా గ్రామీణ నీటి సరఫరా శాఖ (ఆర్‌డబ్ల్యూఎస్) అధికారుల పనితీరు సరిగ్గాలేదని, ఏ పని చెప్పినా వేగంగా చేయడం లేదని జెడ్పీ సర్వసభ్య, డీఆర్సీలో సమావేశాల్లో తరుచూ ప్రజాప్రతినిధులు చేస్తున్న ఫిర్యాదు. అందుకు కారణం లేకపోలేదు.. తిరుపతి ఈఈ విజయ్‌కుమార్ అదనంగా తిరుపతి, చిత్తూరు జిల్లాల ఇన్‌చార్జి ఎస్ఈగా వ్యవహరిస్తున్నారు. ఇంకా 18 మంది ఏఈలు, 9 జేటీఓలు, 2 టైపిస్టులు, జూనియర్ అసిస్టెంట్లు 4, అటెండర్లు 10 ఖాళీలు ఉన్నాయి. అసలే వేసవి సమీపిస్తుండటంతో జిల్లాలోని 31 మండలాల్లో 1000 ప్రాంతాల్లో నీటి సమస్యల ఏర్పడవచ్చని అధికారులు అంచనా వేశారు. ఈ సమస్యలను తీర్చడానికి బోర్‌వెల్స్, బోరు రిపేర్లు, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా, ఇతర ఖర్చులకు రూ.14 కోట్లు అవుతుందని ముందుస్తుగా ప్రతిపాదన సిద్ధం చేశారు. ఈ పనులను టీడీపీ మద్దతు కాంట్రాక్టర్లకు కట్టబెట్టాలని ప్రజాప్రతినిధుల ప్రయత్నాలు సాగుతోంది.

ఆర్అండ్‌బీ: ఆర్అండ్‌బీలో సామాజికవర్గం ముద్ర వేసి ఎస్ఈ ఉమామహేశ్వర్‌రెడ్డిని బదిలీ చేశారు. కానీ ఆ స్థానంలో పూర్తి స్థాయిలో ఎవరినీ నియమించలేదు. డిప్యూటీ ఎస్ఈకు అదనపు బాధ్యతలు ఇచ్చారు. డీఈ 1, ఏఈలు 11, జేఏ 1, జేటీఓ 2, టీఏ 1, అటెండర్లు 2 ఖాళీలు ఉన్నాయి. సంక్రాంతిలోపు గుంతలు లేని రోడ్డు చూస్తారని సాక్షాత్తు సీఎం చంద్రబాబునాయుడు ప్రకటించారు. రోడ్డు మరమ్మతు పనులను పర్యవేక్షించాలి, ఎప్పటికప్పుడు ఆ వివరాలను కంప్యూటర్‌లో ఎంటర్ చేయాలి. పనిలోపనిగా కాంట్రాక్టర్లతో చర్చించాలి, దీనికి తోడు పనులపై సమీక్షించడానికి తరచూ సమావేశాలతో ఉన్న ఉద్యోగులు నలిగిపోతున్నారు. జిల్లాలో మొత్తం 1,500 కిలోమీటర్ల రోడ్డు మరమ్మతు పనులను రూ.21.53 కోట్లతో చేపట్టారు. గడువు దాటి నెలదాటినా జిల్లాలో ఇంకా పనులు పెండింగ్‌లో ఉన్నాయి.

పంచాయతీరాజ్‌శాఖలో

గ్రామీణాభివృద్ధిలో కీలకమైన పంచాయతీరాజ్‌శాఖలో ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డిని గత సర్కార్ మద్దతు అధికారిగా ముద్రవేసి బదిలీ చేశారు. ప్రస్తుతం ఈఈ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. డీఈలు 5, ఏఈలు 4, ఏంఈఓలు 33 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఫీల్డ్‌కు వెళ్లి ఫొటోలు తీసి రోడ్డు పనులను పరిశీలించి వాటిని కంప్యూటర్‌లో ఎంటర్ చేసి ఎంబుక్ రాసే పనులన్నీ ఉన్నవారితో లాగించాల్సి వస్తోంది. పల్లె పండుగ పేరుతో ఎంజీఎన్ఆర్‌జీఎస్ నిధులు రూ.88.37 కోట్లతో జిల్లాలోని గ్రామాల్లో 204 కిలోమీటర్ల సీసీ రోడ్లు వేస్తున్నారు. ఈ రోడ్లు ఎక్కువగా టీడీపీ నేతలు నివాసం ఉన్న ప్రాంతాలు, సూచించిన చోట్ల వేస్తున్న విషయం తెలిసిందే. సంక్రాంతిలోపు వీటిని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా ఇంకా పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఖాళీలు భర్తీ చేయకపోవడంతో పని ఒత్తిడితో అదనపు భారం పడుతోంది.


పంచాయతీరాజ్ జిల్లా కార్యాలయం

శునకాలకు కు.ని చికిత్సలు


ఏబీసీ కేంద్రం వద్ద అధికారులతో చర్చిస్తున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో వీధి కుక్కల నియంత్రణ కోసం కార్పొరేషన్ అధికారులు ఏబీసీ (యానిమల్ బర్త్ కంట్రోల్) కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ఎన్టీఆర్ బస్టాండులోని మున్సిపల్ గ్యారేజీ వద్ద కలెక్టర్ ఏబీసీ కేంద్రాన్ని గురువారం ప్రారంభించనున్నారు. కాగా బుధవారం కమిషనర్ నరసింహప్రసాద్ ఇక్కడ ఏర్పాట్లు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇక నుంచి వీధి కుక్కలను పట్టుకొచ్చి, ఇక్కడే కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు. వైద్యుల పర్యవేక్షణలో ఈ ప్రక్రియ మొత్తం జరుగుతుందన్నారు. కమిషనర్ వెంట ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్, సిబ్బంది ఉన్నారు. పశుసంవర్థక శాఖ వైద్యులు, సిబ్బంది శునకాలకు శస్త్ర చికిత్సలు చేయనున్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

ఐరాల: ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. బుధవారం కోనగుంటలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 50 మందికి వైద్యపరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఆటపాటలతో విద్యను నేర్పాలి

- ఎస్ఎస్ఏ పీఓ వెంకటరమణ

బంగారుపాళెం: అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలబాలికలకు ఆట పాటలతో కూడిన విద్యను నేర్పించాలని సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్టు అధికారి వెంకటరమణ అన్నారు. బుధవారం మండలంలోని మొగిలిమిట్టూరు, తుంబకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతిపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షణ కార్యక్రమాన్ని పీడీతో పాటు ఎంఈఓ నాగేశ్వర్‌రావు సందర్శించారు. వారు మాట్లాడుతూ పిల్లల సమగ్రాభివృద్ధికి, పిల్లల అభ్యసన నైపుణ్యాలు పెంపొందించడానికి జ్ఞానజ్యోతి శిక్షణ దోహదపడుతుందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు శిక్షణలో మెళకువలను నేర్చుకుని 3 నుంచి 6 సంవత్సరాల పిల్లలకు బోధనా సామర్థ్యాలు పెంపొందించాలన్నారు. మండలంలో 101 మంది కార్యకర్తలకు ఆరు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. సీడీపీఓ వాణిశ్రీదేవి, హెచ్ఎంలు పట్టాభి, పార్థసారథి, రిసోర్సుపర్సన్లు మోహన్‌రెడ్డి, రేవతి, ధనంజయరాజు, చంద్రశేఖర్, సూపర్‌వైజర్ జయశ్రీ పాల్గొన్నారు.


మొగిలి మిట్టూరులో మాట్లాడుతున్న పీడీ

భక్తులకు చల్ల చల్లగా..

కాణిపాకం: అప్పుడే ఎండలు మండుతున్నాయి. ఉదయం 8గంటలకే సూర్యుడు సుర్రుమంటున్నాడు. ఆపై ఎండ నుంచి నీడ కోసం ప్రజలు వెతుక్కుంటున్నారు. మధ్యాహ్నానికి ఎండ తీవ్ర అధికంగా ఉంటోంది. ఈ తరుణంలో కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన ఆలయ అధికారులు అప్రమత్తమయ్యారు. ఎండ తీవ్రత నుంచి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని చురుగ్గా ఏర్పాట్లు చేశారు. ఆలయం చుట్టూ గ్రీన్ మ్యాట్‌తో నీడ కల్పించారు. భక్తుల నడక కోసం మ్యాట్ వేసి నిత్యం నీళ్లతో తడుపుతున్నారు. దీంతో పాదరక్షలు లేకుండా ఆలయం చుట్టూ భక్తులు ప్రదక్షిణలు చేస్తున్నారు. త్వరలో కూల్ పెయింట్ వేయనున్నామని ఆలయ అధికారులు పేర్కొన్నారు.


నేలపై వేసిన మ్యాట్


నీడ కోసం ఏర్పాటు చేసిన గ్రీన్ మ్యాట్

వడ్డెర సంఘం బలోపేతానికి కృషి

చిత్తూరు రూరల్(కాణిపాకం): వడ్డెర్ల సమస్యల పరిష్కారానికి, బలోపేతానికి తన వంతు కృషిచేస్తానని వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవాళ్ల మురళి అన్నారు. చిత్తూరులోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో బుధవారం ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. బీసీల్లో పలు కులాలున్నాయన్నారు. వీరంతా చేతి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. చేతివృత్తిదారుల సమస్యల పట్ల సంఘం తరపు తన వంతు పనిచేస్తానన్నారు. దక్షిణాది రాష్ట్రాల బీసీ సంక్షేమ సంఘం ఇన్‌చార్జ్ షణ్ముగం మాట్లాడుతూ పలమనేరు టి.వడ్డూరులో బాలిక మృతికి కారుకులైన వారిని శిక్షించడంతో పాటు ఆ బాలిక కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని ఆయన పేర్కొన్నారు. వడ్డెర సంఘ జిల్లా అధ్యక్షుడు రవిరాజు, సభ్యులు హరి, కుసుమ, రుద్రయ్య, ప్రతాప్ పాల్గొన్నారు. అనంతరం నూతన రాష్ట్ర అధ్యక్షులను సన్మానించారు.


సమావేశంలో మాట్లాడుతున్న నేతలు

నీతి పద్యాల పుస్తకాల పంపిణీ రేపు

చిత్తూరు కలెక్టరేట్: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం పురస్కరించుకుని ఈనెల 21న నీతిపద్యాల పుస్తకాలను పంపిణీ చేయనున్నట్లు తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసినాథంనాయుడు తెలిపారు. ఈమేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో చిత్తూరు నగరంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తామన్నారు. 3 వేల మంది విద్యార్థులకు పుస్తకాలను ఉచితంగా ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.

పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలి


మాట్లాడుతున్న వెంకటరమణ

తవణంపల్లె: పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్టు అధికారి వెంకటరమణ తెలిపారు. బుధవారం తవణంపల్లె హైస్కూల్లో అంగన్‌వాడీ వర్కర్లకు జరుగుతున్న జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులను పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేయడానికి అంగన్‌వాడీ వర్కర్లు కృషిచేయాలన్నారు. పిల్లల్లో అభ్యసనా నైపుణ్యాన్ని మెరుగుపరచాలన్నారు. అనంతరం హైస్కూల్లో పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం భవిత కేంద్రాన్ని సందర్శించారు. దివ్యాంగుల పిల్లలకు ప్రభుత్వం చేయూతనిస్తుందని వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ త్యాగ రాజులు రెడ్డి, హెచ్ఎం దేవరాజులు రెడ్డి, రీసోర్స్ పర్సన్లు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సీఆర్పీ చిట్టిబాబు, సహిత విద్య ఉపాధ్యాయులు దేవేంద్ర, ఢిల్లీ పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

తవణంపల్లె: మండలంలోని దిగువ తడకర సమీపంలోని మామిడి తోపులో పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు తవణంపల్లె ఎస్ఐ చిరంజీవి తెలిపారు. బుధవారం సాయంత్రం దిగువ తడకర సమీపంలోని మామిడి తోపులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. తమ సిబ్బంది పేకాట ఆడుతున్న స్థావరంపై దాడి చేసి వారి నుంచి రూ.4,600 నగదు, ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. దిగువ తడకరకు చెందిన డి.కోదండయ్య(54), టి.మహేష్(38), అరగొండ హరిజనవాడకు చెందిన ఎన్.విశ్వనాథన్(31)పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

అవసరమైన ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు

- ట్రాన్స్‌కో ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్


చిత్తూరు కార్పొరేషన్: వేసవిని దృష్టిలో పెట్టుకొని అవసరమైన ప్రాంతాల్లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయనున్నట్లు ట్రాన్స్‌కో ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ తెలిపారు. బుధవారం చిత్తూరు అర్బన్, రూరల్ డివిజన్ కార్యాలయాల్లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాణిపాకం, నలగంపల్లె, కట్టకిందపల్లె ప్రాంతాల్లోని సబ్‌స్టేషన్లలో ఏర్పాటు చేసిన పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను త్వరలో చార్జ్ చేయనున్నామన్నారు. అలాగే పాపసముద్రం, బొమ్మసముద్రం పూతలపట్టులో వీటిని ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రతినెలా వందశాతం కరెంటు బిల్లుల వసూళ్లు చేయాలన్నారు. ఈనెలలోపు ఎస్సీ ఎస్టీలకు పీఎం సూర్యఘర్ నమోదు పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం స్థలాలు మంజూరు చేసిన కాలనీలలో ఉచితంగా సర్వీసు ఇవ్వాలన్నారు. సర్వీసు ఇచ్చాక అందులో ఎస్సీ ఎస్టీలను పీఎం సూర్యఘర్ కింద రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. యాదమరి, పైపల్లె, పూతలపట్టు, రెడ్డిగుంట సెక్షన్లు పెండింగ్ ఎక్కువగా ఉందని త్వరగా పూర్తిచేయాలని హెచ్చరించారు. ఈఈలు మునిచంద్ర, సురేష్, డీఈ ఆనంద్, శేషాద్రి, ఏఈలు, సబ్‌ఇంజినీర్లు పాల్గొన్నారు.


సమీక్షిస్తున్న ఎస్ఈ, ఈఈ

5 ఫిర్యాదులు

ట్రాన్స్‌కో అర్బన్ ఈఈ కార్యాలయంలో నిర్వహించిన విద్యుత్ గ్రీవెన్స్‌కు 5 ఫిర్యాదులు వచ్చాయని ఈఈ మునిచంద్ర తెలిపారు. అందులో మీటర్ కేటగిరి మార్పు, వ్యవసాయ సర్వీసు విడుదల, పోల్ మార్పు, బిల్లు రివిజన్, కొత్త సర్వీసు విడుదలపై ఫిర్యాదులు వచ్చాయన్నారు. వాటిని పరిశీలించి చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించామని వివరించారు.

రబీపై ఆశలు


వీఎస్ అగ్రహారంలో వరి సాగు

- ఖరీఫ్‌లో ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతులు
- గత ఏడాది 158 హెక్టార్లలో వరి సాగు
- రబీలో భారీగా తగ్గిన వరి సాగు

ఐరాల: గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ప్రకృతి వైపరీత్యాలతో వరి సాగు చేసిన అన్నదాతలు తీవ్ర నష్టాలను చవి చూశారు. దీనిని పూడ్చుకునేందుకు రబీ సీజన్‌లో రెండో పంటగా కోటి ఆశలతో మరోసారి వరి పంట సాగు చేశారు. మండలంలో గత ఏడాది ఖరీఫ్‌లో 158 హెక్టార్లలో రైతులు వరి పంట సాగు చేశారు. దిగుబడులు చేతికందే తరుణంలో అధిక వర్షాలు తుపాన్ల ప్రభావంతో పంట దిగుబడులు పూర్తిగా తగ్గిపోయాయి. కోతల సమయంలో కూడా వానలు తగ్గకపోవడంతో వరి పైరు నేలవాలి గింజలు మొలకెత్తి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసిన పరిస్థితి నెలకొంది. దీంతో ఎకరాకు 25 నుంచి 30 బస్తాల్లోపే దిగుబడులొచ్చాయి. కూటమి సర్కారు మద్దతు ధర కల్పించకపోవడంతో ఆ అరకొర వడ్లను బస్తా రూ.1,300 నుంచి రూ.1,500లోపే అమ్ముకోవలసి వచ్చింది. దీంతో చాలా మంది రైతులు పెట్టుబడులు కూడా చేతికందక పెద్ద ఎత్తున నష్టపోయారు. దీంతో రబీ సీజన్‌లో మండలంలో భారీగా సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. కేవలం 85 హెక్టార్లలో వరి సాగు చేశారు. కూటమి ప్రభుత్వం రైతన్నలకు అందిస్తామన్న పెట్టుబడి సాయం, అన్నదాత సుఖీభవ మొండిచేయి చూపడంతో వరి సాగుపై ఆసక్తి కనబరచలేదు. ఇప్పుడు చెరువులో అరకొరగా ఉన్న నీటితో కొంత మంది రైతులు పంట సాగు చేయగా, మరి కొంతమంది బోరు మోటార్ల వద్ద వరి సాగు చేశారు. వేసవి దృష్ట్యా ఈ పంటలకు చివరి వరకు నీరు అందుతుందా లేదా అన్న అనుమానాలు రైతులను వెంటాడుతున్నాయి.

డబ్బులు ఎవరికీ ఊరికే రావు!

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో కొందరు అధికారుల నిర్లక్ష్యానికి ప్రజాధనం దుర్వినియోగం అవుతోంది. ప్రతి 20 ఏళ్లకు ఓ సారి మాస్టర్‌ప్లాన్ అమల్లోకి వస్తుంది. జనాభా పెరుగుదల, ప్రజల అవసరాల రీత్యా రోడ్లను వెడల్పు చేయాల్సి ఉంటుంది. ఈ విషయం తెలిసి కూడా 2014లో నాటి టీడీపీ పాలకులు చిత్తూరు–వేలూరు రోడ్డులోని గంగనేనిచెరువు వద్ద రోడ్డును ఆక్రమిస్తూ ప్రహరీ నిర్మించి, కంచె వేశారు. దీనికి రూ.10 లక్షలకు పైగా ప్రజాధనం ఖర్చు చేశారు. ఇప్పుడు నగరంలో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో, ఇప్పటికే ఏర్పాటు చేసిన ప్రహరీ, కంచెను కూలదోసి మరొకటి నిర్మిస్తున్నారు. డబ్బులు ఎవ్వరికీ ఊరికే రావనే విషయం అధికారులకు తెలియదా..?


చెరువు లోపల నిర్మిస్తున్న కొత్త ప్రహరీ, కంచె


గంగినేనిచెరువు వద్ద రోడ్డుకు ఉన్న ప్రహరీని కూల్చివేసిన అధికారులు

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
చిత్తూరు : 95539 55610
నగరి : 95539 55609